వి. కె. సంయుక్త అలహాబాద్ నుంచి అడిగిన యీ ప్రశ్నకు సమాధానంగా పై మినీకథ)

★

# సగటు రచయిత

ఆరోజు కాలేజీలో అంతా హడావిడిగా వున్నారు. కారణం, ఆరోజు కాలేజ్ డే.

ఆ సందర్భంగా, ఒక ముఖ్య అతిధి విచ్చేస్తున్నాడు. అతని పేరు సార్వభౌమారావు అతన్ని అతిధిగా ఆహ్వానించడానికి కారణం, కేవలం అతను రచయిత అయివుండటమే

కార్యక్రమం మొదలయింది ముందర ప్రిన్స్‌పాల్ సార్వభౌమారావుని వేదికమీదకి ఆహ్వానించి, ఒక అయిదు నిమిషాలు తను మాట్లాడి సార్వభౌమారావుని ఆ తర్వాత మాట్లాడమని కోరి కూర్చున్నాడు.

సార్వభౌమారావుకి అదే మొదటిసారి కాదు స్టేజిమీద వందలమంది ముందు పూలదండ వేయించుకోవటం, మాట్లాడటం. అందుకని తత్తర పడకుండా ప్రసంగించసాగాడు

తను పది సంవత్సరాలకు పూర్వం ఇదే కాలేజీలో విద్యార్థిననీ, తనకు గౌరవం ఇచ్చినందుకు అందరికి కృతజ్ఞతలు తెల్పుకుంటున్నానని చెప్పి, తను ఎన్నుకున్న అంశం ధారాళంగా ప్రసంగించసాగాడు.

ఆ అంశం "మంచి కథ వ్రాయడం ఎలా?"

కథలోని భాగాలు—అంటే శిల్పం, శైలి ఎతుగడ, పాత్రలు, ముగింపు, పాత్ర పోషణలాంటి అనేకవాటిమీద, తన అనుభవంలోని విషయాలను అక్కడక్కడ వుదహరిస్తూ, ముప్పావుగంట పైగా శ్రోతలందరినీ అంగుళం అయినా కదలకుండా కూర్చోపెట్టేశారు సార్వభౌమారావు.

ఆ ఉపన్యాసం విన్నాక చాలామందికి కథ వ్రాయాలన్న ఇన్‌స్పిరేషన్ వచ్చింది.

ఇకముందు కథ చదివితే అది మంచికథ అవునా, కాదా అన్న సంగతి తేల్చుకోవచ్చనుకున్నారు ఒకరిద్దరు.

తమ అభిమాన రచయితని కళ్ళారా చూసుకోగలిగాం అన్న తృప్తి చాలామంది పాఠకులకు కలిగింది. దాదాపు రెండువందల పాతిక కథలదాకా సార్వభౌమారావువి ప్రచురితం అయ్యాయి. రెండు సంపుటాలుకూడా వెలువడినాయి.

ప్రోగ్రాం పూర్తయాక సార్వభౌమారావుని ఇంటిదగ్గర టాక్సీలో దింపారు ఇంటిలోకి రాగానే పూలదండ తను కథలు వ్రాసుకునే టేబిల్ మీద పడేసారు. కొద్దిగా గర్వంగా.

అతని భార్యకి మొదటి పూలదండ చూసినప్పుడు కలిగిన థ్రిల్ ఇప్పుడంతగా లేదు కాబట్టి "సభ బాగా జరిగిందా?" భోజనం వడ్డించమంటారా?" అన్నది మామూలుగానే.

"వడ్డించు" అని సార్వభౌమారావు తనకొచ్చిన వుత్తరాలను నాలిగింటిని అందుకుని చదవసాగాడు. వాటిలో ఒకటి పోస్టుకార్డుదానిమీద ఇలా వుంది.

అయ్యా, అమ్మా,

మీ రచన "ఎవరికెవరు" ప్రచురణకి తీసుకోలేదని తెలుపటానికి చింతించుచున్నాము.

వ్రాతప్రతితో తగినన్ని తపాలాబిళ్ళలు అతికించిన చిరునామాగల కవరు జతపరచి వున్నట్లయితే, అది మీకు త్రిప్పి పంపబడుతుంది.

దీని విషయమై ఎటువంటి ఉత్తర ప్రత్యుత్తరాలు జరిగే అవకాశం లేదని గుర్తించగోరుతాము.

చిత్తగించవలెను
సంపాదకుడు.

మరొక కవరులో ఆ కథ "ఎవరి కెవరు" తిప్పి పంపబడటం గమనించాడు సార్వభౌమారావు దీర్ఘంగా నిట్టూర్చాడు.

"అన్నం వడ్డించాను" అన్నకేక లోపలనుంచి వినపడగానే, "వస్తున్నాను" అని అరిచాడు బదులుగా.

"మంచి కథ వ్రాయటం ఎలా?" అన్న అంశం గురించి చెప్పాను కాని, అన్నీ మంచి కథలే వ్రాసే రచయిత ఈ లోకములో వుండటం అరుదని చెప్పటం మరిచాను" అనుకున్నాడు సార్వభౌమారావు అన్నం కలుపుకుంటూ.

## 'ఎందుకిలా?'

అమృతరావు వ్రాసిన కథకి ఫస్టుప్రైజ్ వచ్చింది. ఒక వారపత్రిక నిర్వహించిన కథల పోటీల్లో ఫస్టుప్రైజ్ వచ్చింది. అమృతరావు నాకు బాల్య స్నేహితుడు.

* * *

ఎలిమెంటరీ స్కూల్‌కి కలిసే వెళ్లేవాళ్ళం ఇద్దరం. హైస్కూలుకి నా సైకిల్ మీద ఇద్దరం కలిసే వెళ్ళేవాళ్ళం. స్కూలుఫైనల్‌తో నా చదువు ఆగిపోయింది మాకు కంగన్‌హాల్ వుండటం వలన, నాకు చదువు అబ్బకపోవటం వలన, నాన్నగారు నన్ను ఆ వ్యాపారంలోకి ప్రవేశ పెట్టారు.

అమృతరావు విజయవాడ హాస్టల్లో వుండి డిగ్రీ పూర్తిచేశాడు. అక్కడే ఓ ప్రయివేట్ కంపెనీలో ఉద్యోగం సంపాదించి, తీరిక సమయాలలో కథలు వ్రాసుకున్నాడు.